క్లుప్తంగా

విద్యుత్ సిబ్బందికి అభినందనలు



విద్యుత్ సిబ్బందిని అభినందిస్తున్న డీఈఈ ఫణికిరణ్‌కుమార్

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం గ్రామ దేవతల పండగలో వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా విద్యుత్ అందించి అందరి మన్ననలు పొందారని ఆ శాఖ సిబ్బందిని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫణి కిరణ్‌కుమార్ అభినందించారు. గురువారం తన కార్యాలయంలో ఓఅండ్‌ఎం కార్మికులు, సంబంధిత ఇంజినీర్లతో సమావేశమై ప్రత్యేకంగా అభినందించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రతి స్థాయిలోనూ జాగ్రత్తలు తీసుకుని విజయవంతంగా, ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా విద్యుత్ అందజేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణ, ఇంజినీర్లు దివ్య రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

బలిజిపేట: రైతులకు అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. అరసాడలో రైతులకు గురువారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులను సకాలంలో సరఫరా చేస్తామన్నారు. ఏవో శ్రావణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

మక్కువ: మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల నాయకులు కృష్ణ, పార్వతీ, కమలమ్మ, పైడితల్లి కోరారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో గురువారం ఎండీఎం నిర్వాహకులు విద్యాశాఖ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నెల నుంచి ఏప్రిల్ వరకు ఉన్న పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, అలాగే మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్ విత్తనాలు సక్రమంగా పంపిణీ చేయాలి

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని గాదెలవలస రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై వరి, పచ్చిరొట్ట పంట విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్.అవినాష్, మండల అధికారులు, పలు గ్రామాల రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ కోసం అవస్థలు



కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

జియ్యమ్మవలస రూరల్: ఆధార్ సీడింగ్ కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో కొత్త ఆధార్‌కార్డులు, బ్యాంకు, రేషన్‌లకు ఆధార్ లింకు కోసం వచ్చే వారంతా రోజంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కో వ్యక్తి ఆధార్ పనిని పూర్తి చేసేందుకు ఎక్కువ సమయం పడుతుండడం, ఒక్కోసారి సర్వర్ ఇబ్బంది పెడుతుండడం, మరోసారి సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండకపోవడం వంటి కారణాలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి పని ఒక్కరోజులో జరగడం లేదు. ఒక్కొక్కరు రెండు మూడు రోజులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వారంతా ఆధార్ నమోదు కార్యక్రమం ఉదయం 8 గంటలకే ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

‘భరోసా’ లేక.. అప్పు పుట్టక...

- పంటలకు పెట్టుబడి సాయం అందక అన్నదాత తిప్పలు
- పంటల బీమాపై చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- అప్పుల కోసం అన్నదాత అవస్థలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిన రైతు భరోసా నగదు (ఫైల్)

పార్వతీపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు ముందు ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగా పలకరించాయి. ఈ క్రమంలో వ్యవసాయ భూములను సిద్ధం చేసి విత్తనాలు చల్లేందుకు అన్నదాత సిద్ధమవుతున్నాడు. అయితే ఖరీఫ్‌కు సంబంధించి గత ప్రభుత్వంలో అందజేసిన రైతు పెట్టుబడి సాయం రైతు భరోసా అందక, పెట్టుబడి ఖర్చుల కోసం రైతులకు అప్పులు పుట్టక అవస్థలు పడుతున్నారు. ముందుగా ఆర్థికంగా కొంత మొత్తాన్ని ఏర్పాటు చేసుకోకపోతే పంటకు పెట్టుబడి కష్టతరం అవుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల కష్టాల పట్ల ఆలోచన చేసి ఒక కార్యాచరణతో గత ఐదేళ్లు మే లేదా జూన్ మాసంలోనే తొలి విడత పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతులకు అందించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండో ఏటా ఖరీఫ్ సీజన్‌కు కూడా రైతుల వైపు చూసే దాఖలాలు కన్పించడం లేదు. సూపర్ సిక్స్‌లో భాగంగా రైతన్నలకు రూ.20వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు ప్రస్తుతం ఆ ఊసే పట్టనట్టు వ్యవహరించడం పట్ల అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఇదిలా ఉండగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వమే రైతు బీమాలను చెల్లించే బాధ్యత తీసుకోగా ప్రస్తుత



దుక్కి దున్నుతున్న రైతు

కూటమి ప్రభుత్వం బహిరంగాంగానే పంట బీమాపై వారికి సంబంధం లేనట్టుగా రైతులపైనే బీమా భారం వేసింది.

హామీలు ఇచ్చిన దాని కంటే మిన్నగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వంగా నిలిచింది. ఇచ్చిన హామీల కంటే మిన్నగా ఏటా రూ.13,500లు చొప్పున రైతన్నలకు ఐదేళ్ల పాలనలో రూ.67,500 చొప్పున నేరుగా పెట్టుబడి సాయాన్ని రైతన్నలకు అందించి అండగా నిలిచింది. ప్రతీ రైతు కుటుంబానికి పీఎం కిసాన్‌తో కలిపి ప్రతీ ఏడాదిలో మే లేదా జూన్‌లో రూ.7,500లు, అక్టోబర్‌లో రూ.4వేలు, జనవరిలో రూ.2వేలు చొప్పున వారి ఖాతాల్లోనే క్రమం తప్పకుండా జమ చేసింది. ఈ మేరకు పీఎం కిసాన్ పరిధిలోకి రాని నాన్ వెబ్‌ల్యాండ్ భూ యజమానులతో పాటు వారసత్వంగా భూములు పొందిన వారు, ఎక్వైర్డ్ ల్యాండ్ సాగు దారులతో సహా అటవీ, దేవదాయ, భూ సాగుదారులకే కాకుండా సెంటు భూమి కూడా లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కౌలు దారులకు కూడా ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వమే నేరుగా రూ.13,500లు చొప్పున పెట్టుబడి సాయం జమ చేసింది.

వడ్డీ వ్యాపారులే గతి...



కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద సూపర్ సిక్స్‌లో రూ.20వేలు అందిస్తామని వాగ్దానం చేసి రెండో ఏడాది ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా ఎక్కడా వాటి ఊసే లేకుండా వ్యవహరిస్తుంది. గత ప్రభుత్వంపై పీఎం కిసాన్‌తో కలసి రైతు భరోసా సాయాన్ని అందించినపుడు టీడీపీ నేతలు ఎన్నో విమర్శలు చేశారు. ఇప్పుడు కనీసం ఇచ్చిన హామీపై స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇంత అదునులోను కూడా పెట్టుబడి సాయం చేతిలో లేకపోవడం మళ్లీ అప్పుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, దళారుల చుట్టు తిరుగుతూ అధిక వడ్డీలైనా వారిపైనే ఆధార పడాల్సి వస్తుంది.

– ఉరిటి అచ్యుతనాయుడు, కొత్తపట్నం, పార్వతీపురం మండలం

కార్యాచరణ జరుగుతోంది..



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల నుంచి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయడం జరుగుతుంది. బీమా విషయంలో రైతులే చెల్లించాల్సి వుంటుందని ఇప్పటికే స్పష్టత వచ్చింది. విత్తనాలు, ఎరువులు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం చేయడం జరిగింది. రైతుల సబ్సిడీ ద్వారా వాటిని కొనుగోలు చేసుకొనేందుకు ఆ గ్రామాల్లో ఉన్న ఆర్ఎస్‌కే కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరిగింది.

– కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం

‘వెన్నుపోటు దినం’తో సత్తా చాటాం.. : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ బద్నాన ప్రమీల

పాచిపెంట: సాలూరు పట్టణంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేసిన పాచిపెంట మండలం పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలకు ఎంపీపీ బద్నాన ప్రమీల కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరులతో గురువారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఏ మేరకు ప్రజా వ్యతిరేకత ఉందో అని చెప్పడానికి వెన్నుపోటు దినోత్సవమే ఒక నిదర్శనం అన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, వేల సంఖ్యలో స్వచ్ఛందంగా వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఇచ్చిన హామీల అమలు చేయకపోతే రానున్న రోజుల్లో ఇలాంటి పోరాటాలు ప్రజా ఉద్యమాలుగా మారి తీవ్ర రూపం దాలుస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు మానుకుని తల్లికి వందనం, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాలు అమలుపై దృష్టి సారించాలన్నారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరం నాయుడు, వైస్ ఎంపీపీ మీసాల నారాయణ, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, పద్మాపురం సర్పంచ్ బద్నాన వీరయ్య, కునుకు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పోలమాంబ ఆలయంలో పూజలు



పోలమాంబ అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పెదగైశీల గ్రామంలో ఏడూళ్ల పోలమాంబ అమ్మవారిని గురువారం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు దర్శించుకున్నారు. పెదగైశీల గ్రామంలో ఏడూళ్ల పోలమాంబ అమ్మవారి ఆలయాన్ని నిర్మించి, ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నాలుగు గ్రామాల ప్రజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగునాయుడు హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘భోజనం’ నిర్వాహకుల వేతనాలు పెంచాలి



ఎంఈవో విమలకుమారికి వినతిప్రతం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చి, పని భారం పెంచిన ప్రభుత్వం, నిర్వాహకులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. పార్వతీపురం ఎంఈవో వై.విమలకుమారికి ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకంలో అనేక మార్పులు ప్రవేశపెట్టిందని ఆ మార్పులకు అనుగుణంగా, నిర్వాహకులకు పెరిగిన పని భారానికి తగిన విధంగా పారితోషికం పెంచడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. కేవలం రూ.3000 పారితోషికంతో నిర్వాహకులు పని చేస్తున్నారని, రోజురోజుకు ధరలు పెరుగుతున్న నేటి పరిస్థితులలో ఆ వేతనం ఏ మాత్రం చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం పథక నిర్వాహకులకు వేతనం రూ.10వేలకు పెంచాలని కోరారు. విద్యార్థులకు ఇస్తున్న రేషన్ సరుకులు సరిపడినన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు తులసి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావును కలిసిన ఎస్ఐ



ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎస్ఐ

పార్వతీపురం రూరల్: మండలంలో గురువారం జరిగిన ఓ శుభ కార్యంలో పాల్గొనేందుకు వచ్చిన ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డీవీజీ శంకరరావును పార్వతీపురం రూరల్ ఎస్ఐ బి.సంతోషికుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. ఓ మొక్కను అందజేశారు.

● ఎందుకీ నిర్లక్ష్యం!



బలిజిపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వనం – మనం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు తెచ్చిన మొక్కలు ఇలా నిర్లక్ష్యంగా చిందర వందరగా పడేశారు. జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీటిని తెచ్చారు. మొక్కలను సంరక్షించాల్సిన అధికారులే ఇలా నిర్లక్ష్యంగా పడేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– బలిజిపేట

● తస్మాత్...





పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీ మీదుగా ఒడిశాకు నిత్యం రాకపోకలు సాగుతూ ఉంటాయి. ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కృష్ణపల్లి నుంచి పెదమరికి వైపు వెళ్లే రహదారి ఆంధ్రా – ఒడిశా సరిహద్దుల వరకు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయక మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు తక్షణమే ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– పార్వతీపురం రూరల్

● పల్లె నేస్తాలు.. ఈ పక్షులు



ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందంటే.. ఎక్కడెక్కడి పక్షులో...పంట పొలాల్లో వచ్చి వాలుతాయి. తమకు దొరికిన తిండి గింజలను తింటూ పొలాల్లో తమ ఆహారాన్ని వెతుక్కుంటాయి. ఇలా పార్వతీపురం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తమ ఆహారం కోసం పక్షులు ఇలా పంట పొలాల్లో వచ్చి వాలాయి. సాక్షి కెమెరాకు చిక్కాయి.

– పార్వతీపురం రూరల్

● రేషన్ కష్టాలు





రొక్కాడితేగాని డొక్కాడని జీవితాలు వారివి. పనులు మానుకొని రేషన్ సరుకులు కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దర్జాగా ఇంటి వద్దనే రేషన్ సరుకులు తీసుకున్న లబ్ధిదారులు ప్రస్తుతం రేషన్ సరుకులు తెచ్చేందుకు పొరుగూళ్లకు కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించడంతో మళ్లీ పాత కష్టాలే వచ్చి పడ్డాయంటూ గిరిజనులు వాపోతున్నారు. మండలంలోని దేవరశిర్లాం పంచాయతీ లోవరఖండి, గొడేవలస గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులు గురువారం ఠారెత్తిస్తున్న ఎండలో దేవరశిర్లాంలోని రేషన్ దుకాణం వద్దకు సరుకులు కోసం ఇటు మూడు, అటు మూడు కిలోమీటర్లు దూరం కాలినడకన వచ్చి, తలపై, భుజాన కావిడితో రేషన్ సరుకులు తీసుకువెళ్తున్న దృశ్యాలు సాక్షి కంట గురువారం పడ్డాయి.

– మక్కువ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బలిజిపేట: గలావల్లి ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని దీనిని వినియోగదారులు గమనించాలని ఏఈ సింహాచలం గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీనిని గమనించి సహకరించాలని కోరారు.



పార్వతీపురం టౌన్ : డీఈఐసీలో మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు



బలిజిపేట : చిలకలపల్లిలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ రవికుమార్



మక్కువ: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ గంగమ్మ, మండల ప్రత్యేకధికారిణి శ్యామల



పార్వతీపురం టౌన్: జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు



సీతానగరం : మొక్కలు నాటుతున్న ఉద్యానవన శాఖ హెచ్‌ఓ ప్రత్యూష



సాలూరు: మొక్కలను నాటుతున్న మున్సిపల్, అటవీ, పోలీసు అధికారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పలువురు పేర్కొన్నారు. ఇది అందరి బాధ్యతగా స్వీకరించాలన్నారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు చోట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్